క్లుప్తంగా

పులివెందులలో టీడీపీ గెలుపు అప్రజాస్వామికం


బుడితి సుమన్

నరసాపురం: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల మండలంలో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో టీడీపీ గెలుపు అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బుడితి సుమన్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగ వ్యవస్థలను ఖూనీ చేసి ఓటర్లను ఇంట్లో నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకుని ఓట్లు రిగ్గింగ్ చేసి తెలుగుదేశం పార్టీ గెలిచిందని మండిపడ్డారు. దేశ చరిత్రలో ఏ ఎన్నికల్లోనూ లేని హింసాకాండను కేవలం పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో దేశ ప్రజలందరూ చూశారని పేర్కొన్నారు. నలభై ఏళ్ల పైగా రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు కేవలం ఒక్క జెడ్పీటీసీ స్థానం గెలుపు కోసం వ్యవస్థలను దిగజార్చడం హేయమని పండిపడ్డారు. తెలుగుదేశం పార్టీకి నిజంగా ప్రజాబలం ఉంటే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు.

గ్రామ దేవతలకు వెండి ఆభరణాల సమర్పణ


ప్రత్యేకాలంకరణలో అమ్మవార్లు

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామదేవత దండు మారెమ్మ, పేటమారమ్మ అమ్మవార్లకు గ్రామానికి చెందిన భక్తుడు కంచర్ల సూర్యనారాయణ కుమారులు కంచర్ల శివనారాయణ, ప్రసాద్, నరేష్ లు వెండి నేత్రాలు, బొట్టు, నత్తిబెసారా ఆభరణాలను సమర్పించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అమ్మవార్లకు అలంకరించారు. దాతపేరున ప్రత్యేక పూజలు చేసి ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముంపు రైతులను ఆదుకోవాలి


తూర్పుపాలెంలో మునిగిన వరి చేలను చూపుతున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: భారీ వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం సత్వరం ఆదుకోవాలని పోడూరు మండల సీపీఎం నాయకుడు పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం పోడూరు మండలంలో నీట మునిగిన వరిచేలను పరిశీలించారు. రెండు రోజుల నుంచి భారీ వర్షంతో మండలంలో పలు గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయన్నారు. వరి నాట్లు వేసిన రెండు, మూడు రోజుల్లోనే వరిచేలు మునిగిపోవడంతో రైతులకు రూ.15 వేల వరకూ నష్టం వాటిల్లిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కంకంటాల భాస్కరరావు, ముడే మోజేష్, కేతా కృష్ణారావులు పాల్గొన్నారు.

ఏటిగట్టు లైటింగ్ అధ్వానం

నరసాపురం: నరసాపురంలో గోదావరి ఏటిగట్టు పొడవునా వీధి లైట్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఎక్కడా సవ్యంగా లైట్లు వెలగడం లేదు. కొన్ని చోట్ల పోయిన లైట్లను మునిసిపల్ అధికారులు తిరిగి ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలందర్‌రేవు, లలితాంబ ఘాట్ వద్ద, పడవల రేవు తప్పిస్తే ఏటిగట్టు పొడవునా మరెక్కడా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పూట వీధి దీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతమంతా అంధకారంతో ఉంటుందని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి లైట్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి సాయం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం పిప్పళ్లవారితోట హైస్కూల్ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన పిప్పళ్ల పిప్పళ్ల సత్యనారాయణ (పెద్దబ్బులు) రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం స్వాతంత్య్ర వేడుకల నేపథ్యంలో హైస్కూల్‌కు విచ్చేసిన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సమక్షంలో చెక్కును హెచ్‌ఎం శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా దాత అబ్బులును సర్పంచ్ ఎలీషా తదితరులు అభినందించారు.

డిజిటల్ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): డిజిటల్ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ భవనంలో 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాష డిజిటల్ లైబ్రరీ ప్రారంభించారు. లైబ్రరీకి కావాల్సిన కంప్యూటర్స్, ప్రింటర్లను దాత, బార్ కౌన్సిల్ సభ్యులు కీర్తి రామ జోగేశ్వరరావు అందజేశారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సూర్య కిరణ్ శ్రీ, అదనపు సివిల్ జడ్జి కె.లలితాదేవి పాల్గొన్నారు.

త్యాగధనుల స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి
- ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు


నరసాపురం: శివాలయం సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముదునూరి ప్రసాదరాజు


పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

నరసాపురం: ఎందరో మహానుభావుల బలిదానాలు, ప్రాణత్యాగాలు, పోరాటాలు ఫలితంగా సాధించుకున్న స్వాతంత్య్ర భారతాన్ని వారి స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. 79వ స్వాతంత్య్ర వేడుకలు శుక్రవారం నరసాపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ముదునూరి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర ఫలాలు అందరికీ అందాలని కోరారు. అక్కడి నుంచి 70 అడుగుల జాతీయ పతాకంతో పట్టణంలో ముదునూరి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీ చేశారు. శివాలయం సెంటర్ వద్ద గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం స్టీమర్‌రోడ్డు జంక్షన్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న, వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యుడు పీడీ రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బర్రి శంకరం, షేక్ బులిమస్తాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చాగంటి సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, వైకేఎస్, పప్పుల రామారావు, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, తెన్నేటి గిరి, బందన పూర్ణచంద్రరావు, నియోజకవర్గ పార్టీ యూత్ విభాగం అధ్యక్షుడు చినిమిల్లి చందు, యర్రా శ్రీను, వంగలపూడి జక్కరయ్య పాల్గొన్నారు.

నరసాపురం వేడుకలు ఇలా

నరసాపురం పట్టణంలో వివిధ రాజకీయపార్టీలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ దాసి రాజు, వైఎన్ కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అందే రామసతీష్ బీజీబీఎస్ మహిళా కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, సూర్యా కళాశాలలో కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ, గౌతమి విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్ జెండాను ఎగురవేశారు. ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలోనూ, టాక్సీస్టాండ్‌లోనూ జెండా ఆవిష్కరణలు చేశారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: 79వ స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడే గుణ్ణం నాగబాబు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ఎందరో మహానీయులు స్వాతంత్ర సమరోద్యమంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేసిన పోరాట పటిమ వల్ల నేడు వేడుకలు జరుపుకుంటున్నామని అన్నారు. అనంతరం యడ్ల తాతాజీ పార్టీ జెండా, స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద చెల్లెం ఆనందప్రకాష్ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో చిలువూరి కుమారదత్తాత్రేయ వర్మ, కోరాడ శ్రీనివాస్, ఉచ్చుల స్టాలిన్, కొప్పాటి వీరాస్వామి, నడపన గోవిందరాజులు నాయుడు, మద్దా చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా వేడుకలు

మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.వి జయసారథి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్, పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కారుమూరి వెంకట నరశింహరావు, వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు రేపాక ప్రవీణ్‌భాను, గాంధీబొమ్మల సెంటర్ వద్ద పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొల్లి కొండ ప్రసాద్, ఏఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి, స్థానిక కుళాయి చెరువు గట్టు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు, లయన్స్ క్లబ్‌లో అధ్యక్షుడు శిడగం సతీష్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దేశాభివృద్ధికి కృషి చేయాలి


యలమంచిలి: మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయజెండా ఎగురవేస్తున్న ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవికుమార్

యలమంచిలి: దేశాభివృద్ధికి కృషి చేయడమే నిజమైన దేశ భక్తని ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మీ రవి కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో ఆమె పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ నాయకులు, కలెక్టర్లు, అధికారులు, డాక్టర్లు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ఇలా ఏ రంగంలో ఉన్న వారైన ఆయా రంగాల్లో నీతి, నిజాయితీ, నిబద్ధతతో పని చేస్తే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే మండలంలోని 32 గ్రామాల్లో శుక్రవారం 79వ స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ నాయకుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. పాఠశాలలో గతేడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

పెనుమంత్రలో..

పెనుమంత్ర: గ్రామీణ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని పెనుమంత్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అన్నారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పెనుమంత్ర మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్య ప్రకాష్‌రావు, ఎంపీటీసీ సభ్యులు గండి రామారావు, చింతపల్లి మంగాదేవి, గరువు గ్రామ సర్పంచ్ ముదునూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ వై రవికుమార్, పోలీస్ స్టేషన్ వద్ద పెనుగొండ సీఐ ఆర్ విజయ్‌కుమార్, మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద పరిశోధనా సంస్థానం సంచాలకుడు డాక్టర్ టి.శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగురవేశారు.

పెనుగొండలో...

పెనుగొండ: పంద్రాగస్టు వేడుకలు పెనుగొండ, ఆచంట మండలాల్లో వాడవాడలా అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం 79వ స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా చిన్నారులు దేశ నాయకుల వేషధారణల్లో అలరించారు. పెనుగొండలో పలు కూడళ్లలో ఆచంట శాసన సభ్యుడు పితాని సత్యనారాయణ, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), గాంధీ బొమ్మల సెంటర్‌లో ఎంపీపీ పెద్ద, వైఎస్సార్ సీపీ నాయకులు, పంచాయతీలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌లు దండు పద్మావతి, చింతపల్లి గనిరాజు, కడలి బేబీ అన్నపూర్ణ, దంపనబోయిన రూపవత, తోట వెంకటరత్నంలు, జెడ్పీ పాఠశాలవద్ద జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన రామయ్య, ఎస్వీకేపీ విద్యా సంస్థల్లో సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజులు పతాకావిష్కరణ చేశారు.

ఆకట్టుకున్న ర్యాలీలు

సిద్ధాంతం, ఇలపర్రుల్లో విద్యార్థులు నిర్వహించిన భారీ ర్యాలీలు ఆకట్టుకొన్నాయి. సిద్ధాంతంలో దేశ నాయకుల వేషధారణలోనూ, ప్రత్యేకంగా తెల్ల దుస్తుల్లోనూ విద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీతో ఆకట్టుకున్నారు. ఇలపర్రులో భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు.

ఆచంట మండలంలో

ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి పతాకావిష్కరణ చేశారు. గ్రామాల్లో సీనియర్ సిటిజన్లను ఘనంగా సత్కరించారు. జెడ్పీ పాఠశాలల్లో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు పతాకావిష్కరణ చేశారు.


పెనుమంత్ర: మండల పరిషత్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి


పెనుగొండ: గాంధీ బొమ్మల సెంటర్‌లో పతాకావిష్కరణ చేస్తున్న ఎంపీపీ పెద్ద, వైఎస్సార్ సీపీ నాయకులు


పెనుగొండ: సిద్ధాంతంలో దేశ నాయకుల వేషధారణల్లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నేడు సంస్కార భారతి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

యలమంచిలి: మండలంలోని దొడ్డిపట్ల శ్రీ కేశవ స్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సంస్కార భారతి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం శ్రీకృష్ణాష్టమి (గోకులాష్టమి) వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు చేగొండి వీర వెంకట సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేవస్థానం వారి సహకారంతో నిర్వహిస్తున్న ఈ గోకులాష్టమి వేడుకల్లో 15 ఏళ్ల లోపు వయసున్న బాల బాలికలు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం అతిథులచే శ్రీకృష్ణతత్వం పై ప్రసంగాలు, కన్నయ్య కోలాట బృందంతో కోలాటం ప్రదర్శన, యాదవ సంఘం వారితో ఉట్టి వేడుక చివరగా ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

యలమంచిలిలో..

స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో శనివారం గోకులాష్టమి సందర్భంగా దేవేరులకు ఉదయం తొమ్మిది గంటలకు పంచామృతాభిషేకం నిర్వహిస్తామని ఆలయ అర్చకులు వాడపల్లి వెంకట రాజ గోపాలకృష్ణ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి అభిషేకాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

పంటల బీమా గడువు పెంపు

తాడేపల్లిగూడెం రూరల్: సార్వా పంటకు సంబంధించిన పంటల బీమా గడువును ఈ నెల 30వ తేదీ వరకూ పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి నారాయణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకుల ద్వారా పంట బీమా చెల్లించాలని పేర్కొన్నారు. రుణాలు తీసుకోని రైతులు గ్రామాల్లో ఆర్ఎస్‌కేలను సంప్రదించి బీమా చేయించుకోవాలని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సిద్ధాంతం వాసులకు ఉత్తమ పురస్కారాలు


కృష్ణా జిల్లాలో అవార్డు అందుకుంటున్న సీఐ వాసా పెద్దిరాజు, వాసా వెంకటేశ్వరరావు

పెనుగొండ: 79వ స్వాతంత్య్ర వేడుకల్లో సిద్ధాంతంలో పోలీసు బ్రదర్స్‌గా పేర్గాంచిన వాసా బ్రదర్స్ కృష్ణా జిల్లాలో ఉత్తమ సీఐ అవార్డులు అందుకున్నారు. సిద్ధాంతానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు సీఐలుగా కృష్ణా జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మచిలీ పట్నంలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో గన్నవరం ట్రాఫిక్ విభాగంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న వాసా పెద్దిరాజు, మచిలీపటనం మహిళా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వాసా వెంకటేశ్వరరావులు ఉత్తమ సీఐ అవార్డులు, ప్రశంసా పత్రాలు ఎక్సైజు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఆర్.గంగాధర్ చేతుల మీదుగా అందుకొన్నారు. ఇద్దరు అన్నదమ్ములు ఉత్తమ అవార్డులు అందుకోవడం గ్రామానికే గర్వకారణమంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల్లో శ్రావణ శోభ


పెనుమంత్ర: మార్టేరులో శ్రీమహాలక్ష్మి అమ్మవారిని త్రివర్ణపతాక తోరణాలతో అలంకరించిన దృశ్యం


పెనుమంత్ర: ప్రత్యేకాలంకరణలో మార్టేరు శ్రీకనకదుర్గమ్మ


పెనుమంత్ర: కరెన్సీ నోట్ల అలంకరణలో మార్టేరు పోలేరమ్మ

యలమంచిలి: శ్రావణ శుక్రవారం సందర్భంగా అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, పంచామృతాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పూజలో పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాస్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించి, భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

పెనుమంత్రలో..

పెనుమంత్ర: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని పెనుమంత్ర మండలంలోని వివిధ గ్రామాల అమ్మవారి దేవాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుమంత్ర శ్రీకనకదుర్గమ్మ, నత్తారామేశ్వరం శ్రీవిజయదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్టేరులోని శ్రీ కనకదుర్గమ్మ, శ్రీమహాలక్ష్మి, గ్రామదేవత శ్రీపోలేరమ్మ అమ్మవారి ఆలయాలలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మి అమ్మవారిని త్రివర్ణపతాక, శ్రీకనదుర్గమ్మ అమ్మవారిని ఫలపుష్పాలతో, శ్రీపోలేరమ్మ అమ్మవారిని ధనలక్ష్మి అవతారంలో నోట్ల కట్లతో అలంకరించిన విధానం భక్తులను ఆకర్షించింది.

పెనుగొండలో..

పెనుగొండ: సామూహిక శ్రావణ శుక్రవారం పూజలు స్థానిక శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి నగరేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించిన అనంతరం మహిషాసురమర్ధనీ, వాసవీ కన్యకపరమేశ్వరి మాతలకు కుంకుమార్చనలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతంలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.


యలమంచిలి: అడవిపాలెం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు


పెనుగొండ: సామూహిక శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మత్సు వైద్యుడు భాస్కరరావు మృతి

తణుకు అర్బన్: తణుకుకు చెందిన సీనియర్ మత్తు వైద్యులు డాక్టర్ గద్దె రామకృష్ణ భాస్కరరావు (75) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో తణుకు, విజయవాడ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వైద్యుడు మరణించడంతో తణుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్యులు తమ సంతాపాన్ని తెలిపారు. తణుకు పట్టణానికి సీనియర్ మత్తు వైద్యనిపుణులుగా గత 50 ఏళ్లుగా సేవలందిస్తున్న భాస్కరరావు మృతి కుటుంబసభ్యులతో పాటు వైద్యరంగానికి కూడా తీరని లోటు అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భాస్కరరావు భౌతిక కాయానికి శుక్రవారం తణుకులో అంత్యక్రియలు నిర్వహించారు. యువవైద్యులకు ఊతంగా ఉంటూ, చివరి మజిలీ వరకు వైద్యసేవలందిస్తూనే తుదిశ్వాస విడిచారని, భాస్కరరావు సేవలను ఐఎంఏ వైద్యులు కొనియాడారు.